కథ

**భార్య చెప్పింది విని అదిరిపడ్డాడు శ్రీపాదరావు.**

**"నువ్వు చెప్పింది నిజమా?" మళ్లీ అనుమానంగా అడిగాడు.**

**"నిజమే. మొదట నేనూ నమ్మలేదు. సందీప్ జరిగింది పూర్తిగా చెప్పాక నమ్మక తప్పలేదు" అంది జయ.**

# గొప్పతనం

''అందుకేనా జయంతి పనిలోకి రావడం లేదు?''

అవునన్నట్టు తలూపింది జయ. శ్రీపాదరావు మొఖం ఆందోళనతో నిండిపోయింది.

''నీ సుపుత్రుణ్ణి పిలు'' కోపంగా అన్నాడు భార్యతో.

''వద్దండీ. ఇప్పుడు వాడినేమీ అనకండి. జరిగినదానికి వాడెంతో బాధపడుతున్నాడు.''

''ఈ పాపంలో వాడి భాగం కూడా వుందా?''

''లేదు. వాడు అమాయకుడు. అయినా వాడి గురించి మీకు మాత్రం తెలియదా?'' అంది జయ.

శ్రీపాదరావు అసహనంగా అక్కడ్నుంచి కదలి హాల్లోకి వెళ్లి ఈజీ చైర్‌లో కూర్చున్నాడు. అతని కళ్లముందు జయంతి రూపమే కదలసాగింది. అందంగా, అమాయకంగా వుండే ఆ కళ్లు తనని తీక్షణంగా చూస్తూ, ప్రశ్నిస్తున్నట్టు కనిపించసాగింది అతనికి.

అతనికి జయంతి మొదటిసారిగా అతనింటికి వచ్చినరోజు గుర్తొచ్చింది. ఆరోజు శ్రీపాదరావు హాల్లో పేపరు చదువుకొంటుంటే ఇంట్లోకి ఓ అమ్మాయి వెళ్లడం చూశాడు. పాతికేళ్లుంటాయి. అందంగా, ఆరోగ్యంగా వుంది. చామనచాయ రంగులో వున్నా మొఖం ఎంతో కళగా వుంది. ఇరుగుపొరుగు ఇండ్లలోని అమ్మాయి కాబోలనుకున్నాడు మొదట. ఆ అమ్మాయి ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో లేచి లోపలికి వెళ్లి చూశాడు. ఆ అమ్మాయి పెరట్లో బట్టలు ఉతుకుతూంది. అప్పుడర్థమైంది అతనికి ఆ అమ్మాయి తన ఇంట్లో పనిమనిషిగా చేరిందని. తర్వాత జయ చెప్పింది ఆ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకొన్న భర్త వదిలేశాడని, ప్రస్తుతానికి తల్లితోనే వుంటూందని, ఆ తల్లే నాలుగిళ్లలో ఆ అమ్మాయికి పని కుదిర్చిందని.

అంత అందమైన ఆడది ఇకపై ప్రతిరోజు తన ఇంట్లో, తన కళ్ల ఎదురుగా తిరుగుతూ కనిపిస్తుందన్న వార్త శ్రీపాదరావుకు ఎంతో ఆనందాన్నిచ్చింది. రోజూ భార్యకు తెలియకుండా జయంతి వైపు దొంగచూపులు చూసేవాడు. జయంతి బట్టలు ఉతుకుతున్నప్పుడు, పాత్రలు తోముతున్నప్పుడు ఏదో ఒక పని కల్పించుకొని పెరట్లోకి వెళ్లేవాడు. ఆమె పనిలో మునిగి వున్నప్పుడు కనిపించే అందాలను చూసి ఆనందించేవాడు. అయితే వెకిలిగా మాత్రం ప్రవర్తించేవాడు కాదు. మనసులో చిలిపి కోరికలున్నా, అనేకసార్లు జయంతితో ఏకాంతం దొరికినా, హద్దు దాటి ప్రవర్తించేవాడు కాదు.

ఒకరోజు అతను స్నానానికి పోబోతూ వంటింట్లో జయంతి తన భార్యతో అంటున్న మాటలు విన్నాడు.

''వయసులో వున్న ఒంటరి ఆడదాన్ని చూస్తే మగవాళ్లు చొంగలు కారుస్తూ, దొంగచూపులు చూస్తూంటారు. అసభ్యంగా, ద్వంద్వార్థాలతో మాట్లాడటం, భార్యకు తెలియకుండా చేయి పట్టుకోవడం చేస్తూంటారు. అన్నిటినీ భరిస్తూ, తెలివిగా తప్పించుకొంటూ రోజులు గడుపుతున్నాను. అయితే మీ సారు మాత్రం బంగారం. నన్ను ఏనాడూ మరో దృష్టితో చూడలేదు. మీరు వున్నప్పుడు ఎలా ప్రవర్తిస్తారో లేనప్పుడూ అలాగే ప్రవర్తిస్తారు. మీ ఇంట్లోనే నేను ధైర్యంగా, నిశ్చింతగా పని చేసుకోగలుగుతున్నాను.''

ఆ మాటలు విన్నాక శ్రీపాదరావు ఎంతో సిగ్గుపడ్డాడు. ఆరోజు నుంచి జయంతిని ఓ కూతురిలా చూసుకొన్నాడు. ఆమె ఇంటర్ సగంలో చదువు నిలిపేసిందని తెలుసుకొని ఆమెకు పుస్తకాలు చదవడం అలవాటు చేశాడు. తాను సేకరించిన మంచి పుస్తకాలను ఆమెకు ఇచ్చి చదవమని చెప్పేవాడు. చదివాక ఇద్దరూ ఆ కథల గురించి చర్చించేవారు. జయంతి భాషను కూడా మార్చాడు. ఆమెకు అవసరమొచ్చినప్పుడు ఆర్థికంగా కూడా సహాయం చేసేవాడు.

గతవారం జయ అన్న కూతురు పెళ్లికి శ్రీపాదరావు దంపతులు హైదరాబాద్ వెళ్లారు. డిగ్రీ చదువుతున్న వారి ఏకైక కుమారుడు సందీప్ తాను రానని, పరీక్షలకు చదువుకోవాలని చెప్పడంతో అతన్ని వదిలేసి వెళ్లారు. ఊరి నుంచి రాగానే సందీప్ చెప్పిన విషయం విని షాకయింది జయ.

సందీప్‌కు తోడుగా రాత్రి పడుకోవడానికి వచ్చిన అతని ఫ్రెండ్స్, రాత్రి వాడిన పాత్రలు కడిగిపెట్టడానికి ఉదయాన్నే వచ్చిన జయంతిపై అఘాయిత్యం చేశారు. జయ భయపడుతూనే భర్తకు విషయం చెప్పింది. ఆమెకు తెలుసు అతను ఇలాంటివి తట్టుకోలేడని. ఎక్కువ ఆందోళన పడతాడని. అయితే విషయం దాచిపెడితే సమస్య అలాగే వుండిపోతుంది. జరిగింది చెప్పేస్తే అతనే దీనికి పరిష్కారం ఆలోచిస్తాడు. భర్తపై ఆ నమ్మకం వుంది ఆమెకు.

ఆరోజు సాయంత్రం శ్రీపాదరావు కొడుకును పిలిచి వివరాలు అడిగాడు. భయపడుతూనే జరిగింది చెప్పాడు సందీప్.

''ఇందులో నీ పాత్ర లేదంటావ్''

''లేదు. అమ్మ మీద ప్రమాణం చేయమన్నా చేస్తాను.''

''మరి వాళ్లు ఆ పాపం చేస్తూంటే నీవేం చేస్తున్నావు?''

''నేను ఉదయం అయిదు గంటలకు జాగింగ్‌కు వెళ్లిపోయాను. ఆరుగంటలకు జయంతి వచ్చింది.''

''ఇంట్లో మేము లేని రోజు, నీ స్నేహితులు వున్నరోజు, ఇంటిని చూసుకోవాలని నీకు తెలియదా? ఒక్కరోజు జాగింగ్‌కు పోకపోతే కొంపలంటుకుపోతాయా?'' కోపంగా కొడుకును చూస్తూ అన్నాడు.

మౌనంగా తల దించుకొన్నాడు సందీప్.

ఆరోజు సాయంత్రం జయంతి తల్లిని ఇంటికి పిలిపించాడు శ్రీపాదరావు. ఆమె వచ్చి ఏం అల్లరి చేస్తుందో, ఎన్ని మాటలంటుందో అన్న భయం అతనికి వుంది. అందుకే ఆమె ఏం అడుగుతుందో, తను ఏం మాట్లాడాలో, ఏం చెయ్యాలో ముందే రిహార్సల్స్ చేసుకొని మరీ సిద్ధమయ్యాడు.

ఆమె రాగానే ''ఏమిటి- జయంతి పనిలోకి రావడం లేదు'' అని అడిగాడు ఆమెకు విషయం తెలుసో, తెలియదో తెలుసుకొందామని.

''మీరు ఊర్లో లేనప్పుడు మీ ఇంట్లో జరిగిన విషయం మీకు తెలియదా?'' ఆశ్చర్యంగా అడిగింది ఆమె.

''తెలిసింది. జరిగినదానికి నేనెంతో బాధపడుతున్నాను. ఈ విషయం ఊర్లో ఎంతమందికి తెలుసు?''

''మేమెవరికీ చెప్పలేదు. చెప్పుకొంటే పోయేది మా పరువే కదా''

''సరిగ్గా చెప్పావు. ఇది మన ఇద్దరి పరువుకూ సంబంధించిన విషయం. కాబట్టి ఈ విషయాన్ని మనలోనే దాచుకొందాం'' అంటూ అల్మెయిరా దగ్గరికి వెళ్లి ఓ నోట్లకట్ట తీసుకొని ఆమెకిస్తూ ''పదివేలు. ఉంచుకో. అవసరానికి వుంటుంది. జయంతి ఇక మా ఇంటికి రాదని నాకు తెలుసు.

ఎందుకు మా ఇంట్లోనించి పోయావని ఎవరైనా అడిగితే జీతం పెంచలేదని చెప్పమను. జరిగిన విషయం బయటికి రాకూడదు. మా ఇంట్లో జరిగిందన్న విషయం పదిమందికి తెలిస్తే నేను తలెత్తుకు తిరగలేను.''

జయంతి తల్లి డబ్బులు తీసుకొని వెళ్లిపోయింది. ఆమె మాటల్లో ఎక్కడా పోలీసు కంప్లయింటు ఇస్తున్నట్టుగాని, మహిళా సంఘాలతో మాట్లాడినట్టుగాని చెప్పకపోవడంతో అతనిలో ఆందోళన చాలావరకు తగ్గింది.


పైగా డబ్బులు చూడగానే ఆమె కళ్లలో మెరుపు అతను గమనించాడు. 'ధనమూలం మిదం జగత్' అనుకొని నవ్వుకొన్నాడు.

★ ★ ★

నాలుగు రోజుల తర్వాత జయంతి తన ఇంట్లోకి రావడం చూసి ఆశ్చర్యపోయాడు శ్రీపాదరావు.

''రామ్మా బాగున్నావా?'' అని అడిగాడు.

బాగున్నానన్నట్టు తలూపి వంటగదిలోకి వెళ్లింది.



ఆ తర్వాత ఆమె పనిలో దిగిపోవడం గమనించాడు శ్రీపాదరావు. ఆమె పెరట్లో వున్నప్పుడు భార్య దగ్గరకు వెళ్లి ''ఏమయింది జయంతి?'' అని అడిగాడు.

''ఏమీ తోచడం లేదని, పనిలోకి వస్తానని అడిగింది. నేను కాదనలేక సరేనన్నాను. అన్ని పనులు చేసుకోవడం నావల్ల కూడా కావడం లేదు. జరిగిన దానిలో మన తప్పూ లేదు. ఆమె తప్పూ లేదు. అటువంటప్పుడు మన ఇంట్లో తిరిగి పనిలో చేరితే తప్పేముంది?'' అంది జయ.

''అలాగే చెయ్యమను. నాకేం అభ్యంతరం లేదు'' అన్నాడు శ్రీపాదరావు.

జయంతి పనయ్యాక ఇంటికి వెళుతూ శ్రీపాదరావు దగ్గరికి వచ్చి ''ఇంట్లో ఏం తోచడం లేదు అంకుల్. పైగా నేను ఎంత బాధపడుతున్నానో అని ఆంటీ ఇక్కడ బాధపడుతూ వుంటారు. ఆమె బాధపడటం నేను భరించలేను. అందుకే నేను మామూలుగానే వున్నానని ఆమెకు తెలియజేయడం కోసం నేను మళ్లీ పనిలో చేరాను. మీరందరూ నాతో ఇదివరకు ఎలా వుండేవారో అలాగే వుండండి'' అంది.

ఆమె తన భార్య మాత్రమే బాధపడుతున్నదని చెప్పడం అతనికి నచ్చలేదు.

''అంటే జరిగినదానికి నేను బాధపడటం లేదంటావా?'' నిష్ఠూరంగా అన్నాడు.

''జరిగినదానికి బాధపడి వుంటారు. నాగురించి బాధపడి వుండరు.''

సి.ఎన్.చంద్రశేఖర్

''అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?''

''బాధపడి వుంటే మా ఇంటికి వచ్చి నన్ను ఓదార్చి వుండేవారు.''

తప్పు చేసినవాడిలా చూశాడు శ్రీపాదరావు ఆమె వైపు.

''నన్ను ఎంతో అభిమానంగా, ఓ కూతుర్లా

చూసుకొన్న మీరు, మీ అబ్బాయి స్నేహితులు నాపై అత్యాచారం చేశారన్న విషయం తెలియగానే మీ పరువు గురించే ఎక్కువగా ఆలోచించారు. ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలా, మానుంచి ఎలాంటి గొడవలు రాకుండా ఎలా మేనేజ్ చెయ్యాలా అనే ఆలోచించారుగాని నా మనసు ఎంత గాయపడి వుంటుందా అని మీరు ఆలోచించలేదు. నన్ను ఓదార్చే ప్రయత్నం చెయ్యలేదు. కనీసం మా అమ్మతో మాటవరసకు కూడా నేనెలా వున్నానని మీరు అడగలేదు.''




సిగ్గుతో తలదించుకొన్నాడు శ్రీపాదరావు.

''మిమ్మల్ని బాధపెడితే నన్ను క్షమించండి. ఇన్ని రోజులూ నా మనసులో వున్న బాధ మీకు చెప్పకుండా వుండలేకపోయాను అంకుల్. మీకు ఓ కొసమెరుపు లాంటి నిజం చెప్పనా?''

## బొద్దుగుమ్మ

**అందాల ఆర్తీఅగర్వాల్ ఇప్పుడు చాలా బొద్దుగా తయారైపోయింది. ఇంతకీ అసలు సంగతేంటంటే ఆమె ఎక్కువగా నాన్‌వెజ్ ఐటమ్స్, ఐస్‌క్రీమ్స్, చాక్లెట్స్ తింటుందట. అందుకే బాగా లావైపోయింది. ఇండస్ట్రీ కొచ్చినప్పటికీ ఇప్పటికీ ఆమె ప్రవర్తనలో కూడా మార్పు కన్పిస్తోంది. ఆఫర్ల కోసం డైటింగ్‌లు చేయడం నా కిష్టం ఉండదని చెప్పే ఆర్తీ కొంచెం లావుగా ఉన్నా పెర్‌ఫార్మెన్స్ విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదంటోంది. కొంచెం కష్టమైన సన్నివేశాలు చేయాల్సి వచ్చినప్పుడు లావుని తగ్గించుకుంటానని అంటోంది.**



చెప్పమన్నట్టు కుతూహలంగా చూశాడు ఆమె వైపు.

''వాళ్లు నాపై అత్యాచారం చెయ్యలేదు. చెయ్యబోయారు అంతే.''

''నిజమా?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''అవును. ఆవేశం తప్ప మరొకటి తెలియదు వాళ్లకు. నా బట్టలు చించడం తప్ప మరేం చెయ్యలేదు వాళ్లు.''

శ్రీపాదరావుకు ఆ విషయం ఎంతో రిలీఫ్‌నిచ్చింది.

''మరి మా అబ్బాయి అలా చెప్పాడు'' అనుమానంగా అడిగాడు.

''మీ అబ్బాయి అమాయకుడు. చూసింది కొంత. ఊహించింది కొండంత. పైగా ఆ స్నేహితులు తాము హీరోలమని చెప్పుకోవడానికి అబద్ధం చెప్పి వుండొచ్చు.

అలాంటివాళ్లు పదిమంది మీదపడ్డా వాళ్లకు బుద్ధి చెప్పగల ధైర్యం, బలం నాకుంది.''

ఆ క్షణం శ్రీపాదరావు కళ్లకు ఝాన్సీలక్ష్మిలా కనిపించింది జయంతి.

''ఏమీ జరగనప్పుడు మా ఇంటికి ఇన్ని రోజులూ ఎందుకు రాలేదు?'' అని అడిగాడు ఆమెని.

''దానికి కారణం మీ ప్రవర్తన. ఆ కుర్రాళ్ల ప్రవర్తన గురించి ఎక్కువ బాధపడలేదు నేను. కాని మిమ్మల్ని ఎంతో గొప్పగా ఊహించుకొన్న నేను మీరు మామూలు మనిషికన్నా తక్కువగా ఆలోచించడం, ప్రవర్తించడం చూసి ఎంతో నిరుత్సాహపడ్డాను. షాకయ్యాను కూడా. ఆ షాకు నుంచి తేరుకోవడానికి ఇన్ని రోజులు పట్టింది.''

బాధగా కళ్లు మూసుకొన్నాడు శ్రీపాదరావు. తను ఇంత పెద్ద తప్పు చేశానని ఆమె చెప్పేవరకు తనకు తెలియనందుకు తనపై తనకే కోపం వచ్చింది.

ఆమె తను తెచ్చుకొన్న సంచి నుంచి ఓ ప్లాస్టిక్ కవరు తీసి అతనికి ఇస్తూ ''ఇందులో మీరు మా అమ్మకు ఇచ్చిన పదివేలు వుంది. మా అమ్మకు డబ్బు పైన ప్రేమ ఎక్కువ. అందుకే ఆమె మీకు విషయం పూర్తిగా చెప్పలేదు. నన్నూ చెప్పవద్దని ఒట్టేయించుకొంది'' అంది నవ్వుతూ.

''ఫర్వాలేదమ్మా మీ అమ్మకు ఇచ్చేయ్ ఈ డబ్బులు.''

''వద్దు అంకుల్. డబ్బులతో అన్ని సమస్యలూ తీరవు. ఎంత ఇచ్చినా తృప్తి వుండదు.

మీకు వీలైతే ఆ కుర్రాళ్లను పిలిపించి, మందలించి, ఆ తప్పు వాళ్లు మళ్లీ చెయ్యకుండా పరివర్తన తీసుకురండి.

ఎందుకంటే అందరు ఆడపిల్లలూ నాలా సబలలు కాదు'' అంటూ వెళ్లిపోయింది.

వెళ్తున్న జయంతి వైపే చూస్తూండిపోయాడు శ్రీపాదరావు.

కొంతమంది మనుషులు సాధారణంగా కనబడినా, ఎంత గొప్పగా ఆలోచిస్తారో, ఎంత ఉన్నతంగా ప్రవర్తిస్తారో అతనికి మొదటిసారి తెలిసింది.